

దివ్యాంగులకు మెగా డీఎస్సీ క్రాష్ కోర్సు శిక్షణ

పార్వతీపురం, మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దివ్యాంగులైన అభ్యర్థులకు మెగా డీఎస్సీ క్రాష్ కోర్సు శిక్షణను ఉచితంగా అందించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కె.కవిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయ పోస్టులకు అర్హత ఉన్న వారు ఈ నెల 11 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. టెట్ స్కోర్ ఆధారంగా ఎంపికైన వారికి విజయవాడలో శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. స్టడీ మెటీరియల్, ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామని ఆమె వెల్లడించారు.

ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొందాం

- అధికారులు సిద్ధంగా ఉండాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచన



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ



వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు

పార్వతీపురం, మే7 (ఆంధ్రజ్యోతి): జాతీయ భద్రత రీత్యా ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ ఆర్మీ దాడి చేసి ముష్కరులను మట్టుబెట్టిన నేపథ్యంలో బుధవారం కలెక్టర్లు, కేంద్ర, రాష్ట్ర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిణామాల దృష్ట్యా ప్రజలు భయభ్రాంతులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వారికి పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని తెలిపారు. అన్ని శాఖలు, ముఖ్యంగా భద్రతా దళాలు పూర్తి సన్నద్ధతతో ఉండాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఎస్పీ మాధవరెడ్డి పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శోభిక తదితరులు

అల్లూరి చిరస్మరణీయుడు

పార్వతీపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి పోరాటం ఎన్నటికీ మరువలేదని ఆమె అన్నారు. గిరిజనుల అణిచివేతను వ్యతిరేకించి.. విప్లవ జ్వాలను రగిలించిన మహా పోరాటయోధుడని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో నేటితరం ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె.హేమలత, గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు ఆర్.కృష్ణవేణి, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవాలు

కొత్త రైస్ కార్డులకు వేళాయె

- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- నెల వరకు గడువు ఇచ్చిన ప్రభుత్వం
- ఆరు అంశాల్లో మార్పులు, చేర్పులు

తోటపల్లిలోనే గజరాజులు



6లో

శ్యామలాంబ పండగను విజయవంతంగా నిర్వహించాలి

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి



సిరిమాను రథాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి

6లో

45 వేల మందికి ఈకేవైసీ కాలే..

- వెనుకంజలో సాలూరు, పాచిపెంట, భామిని, సీతంపేట
- వచ్చే నెల 30 వరకు గడువు పొడిగించిన ప్రభుత్వం
- రాష్ట్రంలో ఎక్కడైనా చేసుకునే వెసులుబాటు



సాలూరులో ఎండీయూ వాహనం వద్ద కార్డుదారునికి ఈకేవైసీ చేస్తున్న దృశ్యం

సాలూరు రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల్లో అనర్హులను తొలగించి నిజమైన పేదలకు ఆహారభద్రత, ప్రభుత్వ రాయితీలను అందించడానికి ప్రభుత్వం ఈకేవైసీ కార్యక్రమం ప్రారంభించిన విషయం తెలిసిందే. మార్చి 17న ఈ ప్రక్రియ చేపట్టగా.. తొలుత అదే నెల 31 వరకు గడువు విధించారు. ఆ తర్వాత దానిని గత నెల 30వరకు పొడిగించారు. అయితే జిల్లా పరిధిలో ఈ కార్యక్రమం 93 శాతం వరకు పూర్తయింది. దాదాపు 45 వేల మంది ఇంకా రేషన్ కార్డుల ఈకేవైసీకి దూరంగా ఉన్నారు. సాలూరు, పాచిపెంట, భామిని, సీతంపేట మండలాలు బాగా వెనుకబడి ఉన్నాయి. రాష్ట్రంలో చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉండడంతో ప్రభుత్వం తాజాగా ఈకేవైసీ గడువును వచ్చే నెల 30 వరకు పొడిగించింది.

ఇదీ పరిస్థితి..

- జిల్లాలో 2.81 లక్షల రేషన్‌కార్డులున్నాయి. వాటిల్లో 8,16,859 మంది సభ్యులున్నారు. వారిలో 12,053 మంది ఐదేళ్ల లోపు పిల్లలు, 665 మంది 84 ఏళ్ల పైబడిన వృద్ధులు ఉన్నారు. వారికి ఈకేవైసీ నుంచి మినహాయింపు ఉంది. మిగిలిన 8,04,141 మందిలో ఇప్పటి వరకు 7.59 లక్షల మందికి ఈకేవైసీ పూర్తయింది. మరో 45 వేల మందికి ఈకేవైసీ చేయాల్సి ఉంది. సాలూరు, పాచిపెంట, భామిని, సీతంపేట మండలాల్లో ఈ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాల్సి ఉంది.
- జిల్లాలో రేషన్‌కార్డులకు తగ్గట్టుగా ప్రతి నెలా 5,215 టన్నులకు పైబడి బియ్యం పంపిణీ చేస్తున్నారు. అయితే చాలావరకు పేదల బియ్యం పక్కదారి పడుతోంది. కొందరు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, చిల్లర వర్తకులు కార్డుదారుల నుంచి కేజీ బియ్యాన్ని రూ.14 నుంచి 16 చొప్పున కొనుగోలు చేసి రీసైక్లింగ్‌కు తరలిస్తున్నారు. ఆ తర్వాత వాటిని అధిక ధరకు ఒడిశాకు తరలిస్తున్నారు.
- జిల్లాలో 2022లో రూ. 23.72 లక్షలు, 2023లో రూ. 32.44 లక్షలు, 2024లో రూ. 14.77 లక్షల విలువైన రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. అయినా పరిస్థితిలో

(మిగతా 8వ పేజీలో...)

పోలీస్ వాహనం ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి

- ఉల్లిభద్ర ప్రధాన రహదారిపై గ్రామస్థుల ఆందోళన
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్
- చర్యలు తీసుకుంటామని సీఐ హామీ



ఉల్లిభద్ర ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

గరుగుబిల్లి, మే7(ఆంధ్రజ్యోతి): పోలీస్ వాహనం ఢీకొన్న ఘటనలో గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ చివరకు ప్రాణాలు కోల్పోయాడు. దీనిపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. వివరాల్లోకి వెళ్తే.. పార్వతీపురం మండలం అడ్డాపుశీల సమీపంలో టికెట్ సర్వీసింగ్ కోసం నిరీక్షిస్తున్న ఉల్లిభద్రకు చెందిన ఆటో డ్రైవర్ బిగణేష్ (42)ను మంగళవారం సాయంత్రం పోలీస్ పెట్రోలింగ్ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పార్వతీపురం జిల్లా కేంద్రా సుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి మెరుగవకపోవడంతో అదేరోజు రాత్రి విజయనగరం తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం గణేష్ మృతి చెందాడు. దీంతో భార్య, ఇద్దరు కుమారులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని మరోవైపు ఉల్లిభద్ర వాసులు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం అదే గ్రామ ప్రధాన రహదారిపై బైఠాయించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసే వరకూ కదిలేది లేదని స్పష్టం చేశారు. సుమారు అరగంట పాటు వారు నిరసన తెలపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పార్వతీపురం, పాలకొండ, జియ్యమ్మవలస, శ్రీకాకుళం, కురుపాం ప్రయాణికులు , వాహనదారులు ఇబ్బందులపాలయ్యారు. విషయం తెలుసుకున్న చినమేరంగి సీఐ టీవీ తిరుపతిరావు , గరుగుబిల్లి ఎస్ఐ రమేష్ నాయుడు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకున్నారు. గ్రామస్థులతో మాట్లాడి ఆందోళన విరమించాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రమాదం జరిగిన సమయంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని నడుపుతున్న జియ్యమ్మవలస కానిస్టేబుల్ ప్రసాద్ మద్యం తాగి ఉన్నారా? లేదా అన్న విషయంపై అవసరమైన పరీక్షలకు సిఫారసు చేశామన్నారు. ప్రమాదంపై విచారణ జరిపి తగు చర్యలు నిమిత్తం ఎస్పీకి నివేదిక అందిస్తామని వెల్లడించారు. మద్యం తాగి అజాగ్రత్తగా వాహనం నడిపినట్లు రుజువైతే చర్యలు తప్పవన్నారు. దీంతో గ్రామస్థులు శాంతించారు. కాగా ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని మరోవైపు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బీవీ రమణ గరుగుబిల్లిలో పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణమైన పోలీస్ వాహనం నెంబరు ప్లేటును మార్చి నిందితుడిని కాపాడేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఇంతవరకు కేసు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు.



గణేష్ (ఫైల్)

నిర్మాణాలకు అనుమతులు సులభతరం

- ఆర్‌డీ డీటీసీపీ నాయుడు




సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీ డీటీసీపీ నాయుడు

పార్వతీపురం టౌన్, మే7(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల పరిధిలో లే అవుట్లతో పాటు వివిధ నిర్మాణాలకు అనుమతులను సులభతరం చేయనున్నట్లు రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి (ఆర్‌డీటీసీపీ) తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'మున్సిపాల్టీలో బహుళ అంతస్తులు, వాణిజ్య సముదాయాలు, గృహ నిర్మాణాలకు సంబంధించి ఆయా సచివాలయాల పరిధిలో దరఖాస్తు చేసుకోవాలి. వాటికి మున్సిపల్ కమిషనర్ అనుమతులు తప్పనిసరి. నిర్మాణదారులకు త్వరితగతిన సేవలు అందించేందుకు సచివాలయాల ప్రణాళిక విభాగం అధికారులు సిద్ధంగా ఉండాలి. ఈ విభాగంలో టీపీవోతోపాటు నలుగురు అధికారులే ఉన్నారు. 55వేల మంది జనాభా కలిగిన పట్టణంలో ఇంకా అధికారులను పెంచాల్సిన అవసరం ఉంది. 100 అడుగుల లోపు ఉన్న గృహ నిర్మాణాలకు ప్రణాళిక విభాగం అనుమతులు అవసరం లేదనేది అవాస్తవం. ఇక నుంచి భవన నిర్మాణ అనుమతులకు కమిషనర్లే కీలకం. మున్సిపల్ కమిషనర్, ప్రణాళిక విభాగం అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లా కేంద్రంలో అక్రమ లే అవుట్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. సమగ్ర విచారణ జరిపి సంబంధిత యజమానులపై చర్యలు తీసుకుంటాం. ప్రణాళిక విభాగం అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.' అని తెలిపారు.

దర్యాప్తు నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి

- ఎస్పీ మాధవరెడ్డి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పార్వతీపురం టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): దర్యాప్తు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలో పోలీసు అధికారులకు ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఘటనా స్థలం నుంచి శాస్త్రీయ పద్ధతిలో ఆధారాల సేకరణే క్రియాశీలకం. ఫోరెన్సిక్ ఎవిడెన్స్‌లను సేకరించడం, భద్రపరచడం ఎంతో ముఖ్యం. నిందితులు ఎట్టి పరిస్థి తుల్లోనూ తప్పించుకోకూడదు. సాక్ష్యాధారాలను సేకరించే విధానంపై ప్రతిఒక్కరూ పట్టు సాధించాలి. ఆధునాతన సాంకేతిక టెక్నాలజీ సాయంతో దర్యాప్తు చేపట్టాలి.' అని తెలిపారు. ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ, చైన్ ఆఫ్ కస్టడీ మార్గదర్శకాలు, నేర పరిశోధనలో అనుసరించాల్సిన విధివిధానాలు, ఆధునిక శాస్త్రీయ ప్రమాణాలపై ప్రత్యేక నిపుణులు తెలియజేశారు. అనంతరం ఫోరెన్సిక్ నిపుణులను ఎస్పీ సత్కరించారు. పాలకొండ డీఎస్పీ రాంబాబు, డీసీఆర్బీ సీఐ ఆదాం, సీసీఎస్ సీఐ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

1972కు సమాచారం అందించండి

ఎవరైనా డ్రగ్స్ రవాణా చేస్తున్నారనే తెలిస్తే వెంటనే 1972కు సమాచారాన్ని అందించాలని ఎస్పీ సూచించారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై ఈగల్ ఫోర్సు ఎస్పీ కె.నగేష్‌బాబు ఆధ్వర్యంలో పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నిటి కన్నా ప్రమాదకరమైనవి డ్రగ్స్ అని, తెలిసి, తెలియకో వాటి బారిన పడితే ప్రతి ఒక్కరి జీవితం అంధకారమవుతుందని తెలిపారు. అనంతరం 'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్‌ను ఆవిష్కరించారు.

'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవాలు

పాకిస్థాన్‌లోని ఉగ్రమూకల శిబిరాలపై భారతదేశం 'ఆపరేషన్ సిందూర్' పేరిట చేసిన దాడులు విజయవంతం కావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విజయోత్సవాలు నిర్వహించారు. పిల్లలు, పెద్దలనే తేడా లేకుండా ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.



ఎస్.కోట రూరల్: బొడ్డవరలో వాసవీమాతకు పూజలు చేసిన ఆర్యవైశ్య మహిళలు



రాజాం రూరల్: జాతీయ జెండాలతో నినాదాలు చేస్తున్న స్థానికులు




బొబ్బిలిలో హర్షం వ్యక్తంచేస్తున్న మాజీ సైనికులు

మాజీ సైనికుల హర్షం..

విజయనగరం, మే 7 (ఆంధ్రజ్యోతి): భారత సైనికులు ఆపరేషన్ సిందూర్ పేరిట ఉగ్రవాదులను హతమార్చడంపై మాజీ సైనికుల సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేసింది. బుధవారం జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం ఎదుట భారత జెండాలను చేతబట్టి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు దేవర ఈశ్వరరావు, వెంకటరావు, వాసుదేవరావు నాయుడు, వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

కొత్త రైస్ కార్డులకు వేళాయే



- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- నెల వరక గడువు ఇచ్చిన ప్రభుత్వం
- ఆరు అంశాల్లో మార్పులు, చేర్పులు

రాజాం రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా కొత్త రైస్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబీకులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అర్హులైన వారికి కొత్త కార్డులు మంజూరు చేయడంతో పాటు పాత కార్డుదారులకు మార్పులు, చేర్పులు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. కొత్త కార్డుల జారీతో పాటు ఏఏ అంశాల్లో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చునో పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ఈనెల 6న షెడ్యూల్ ప్రకటించారు. దీంతో కొత్త కార్డుల దరఖాస్తుల ప్రక్రియకు జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. బుధవారం నుంచి మండలాల్లోని గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హులైన వారంతా ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేయడం ప్రారంభించారు. నెలరోజుల పాటు దరఖాస్తుల స్వీకరణ, మార్పులు, చేర్పుల ప్రక్రియ అమల్లో ఉంటుంది.

ఆరురకాల సేవలు..

రైస్‌కార్డుల ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం ఆరు రకాల సేవలను ప్రకటించింది. అర్హులైన వారంతా కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేయడంతో పాటు బియ్యం కార్డుల విభజన, కొత్త సభ్యుల చేరిక, చిరునామాల మార్పు, మృతుల పేర్ల తొలగింపు, అనర్హుల వద్ద ఉన్న రేషన్‌కార్డుల సరెండర్ వంటి సేవలందించేందుకు వీలుగా షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇదే సమయంలో ఐదేళ్లలోపు చిన్నారులు, 80 ఏళ్ల దాటిన వృద్ధులకు ఈకేవైసీ నుంచి మినహాయింపు ఇచ్చింది. గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు ఈ గవర్నెన్స్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ప్రధానంగా అనాధ ఆశ్రమాల్లో ఉన్న వృద్ధులకు రైస్‌కార్డులు లేకపోతే వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ప్రస్తుతం 5,71,373 మంది రేషన్ కార్డులు ఉన్నాయి. 36,876 మంది అంత్యోదయ కార్డులు ఉన్నారు. ఇప్పటివరకు 5,42,229 మంది ఈకేవైసీ చేయించుకున్నారు. ఇంకా 66 వేల మంది దూరంగా ఉన్నారు. కార్డుదారుల ఈకేవైసీకి సంబంధించి 95.80 శాతం చేయడం ద్వారా జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. కేవలం 4.20 శాతం మంది రేషన్‌కార్డుదారులు సాంకేతిక కారణాలతో ఈకేవైసీకి దూరమయ్యారు. వీరికి సైతం చేయించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి.

ఎన్నో అవసరాలు..

పేద, బడుగు, బలహీన వర్గాల వారికి రేషన్‌కార్డుతో ఎంతో అవసరం ఉంటుంది. రైస్‌కార్డు కేవలం సబ్సిడీతో అందిస్తున్న సరుకులకే పరిమితం కాకుండా ప్రభుత్వ పథకాలకూ ముడిపడి ఉంది. ప్రధానంగా పేదింట కష్టం వాటిల్లితే రూపాయి ఖర్చు లేకుండా వైద్యసేవలు పొందేందుకు ఆరోగ్యశ్రీతో పాటు పేదింటి విద్యా కుసుమాలు ఉన్నత చదువులు, ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ తదితర ఎన్నో సౌకర్యాలు పొందే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో అర్హులైన వారు కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్నా రు. వీరే కాకుండా చిరునామాల మార్పు, కొత్త సభ్యు ల చేరిక, మృతుల పేర్ల తొలగింపు తదితర వాటి కో సం పందలాది మంది కలెక్టర్, ఆర్డీవోతో పాటు తహసీల్దార్లకు వినతిపత్రాలు అందిస్తూనే ఉన్నారు కలెక్టరేట్‌తో పాటు మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికల్లో కూడా కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చి పడుతున్నాయి.

వైసీపీ హయాంలో..

వైసీపీ ప్రభుత్వ హయాంలో దారిద్ర్యరేఖకు దిగువనున్న వారికి కొత్తగా ఇవ్వడం పక్కన పెడితే అనేక కారణాలను సాకుగా చూపి వందలాది మందిని అనర్హులుగా ప్రకటించి రేషన్‌కార్డులను రద్దు చేసింది. ఫలితంగా ఎంతోమంది ప్రభుత్వ పథకాలు, విద్య, వైద్యసేవలకు దూరమయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి 11 నెలల తరువాత కొత్త కార్డుల జారీతో పాటు మార్పులు, చేర్పులకు మార్గదర్శకాలు జారీ చేయడంతో అన్నివర్గాల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

అర్హులందరికీ రైస్‌కార్డులు..

జిల్లాలో రైస్‌కార్డులు పొందేందుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందిస్తాం. ఇందుకు సంబంధించి కలెక్టర్ అంబేడ్కర్ ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. రేషన్‌కార్డుల ప్రక్రియపై బుధవారం జేసీ ప్రత్యేక సమావేశం నిర్వహించి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. కొత్తగా కార్డు పొందేందుకు అర్హత ఉన్నవారంతా గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు ఈ గవర్నెన్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అందిన దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నవారికి కార్డులు అందజేస్తాం.

-మధుసూధనరావు, జిల్లా సరఫరా అధికారి, విజయనగరం



కన్యకాంబకు నివేదించిన 108 రకాల స్వీట్లు

భక్తిశ్రద్ధలతో కన్యకాంబ పుట్టినరోజు వేడుకలు

రాజాం రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల ఆరాధ్యదేవత వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను రాజాంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి 108 రకాల స్వీట్లతో కూడిన సారెను నివేదించారు. మహిళలు పసుపు, కుంకుమలు సమర్పించారు. అర్చకులు గణపతిశర్మ, నరశింగరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, తిరువీధి ఉత్సవం నిర్వహించారు.



తోటపల్లి సమీప తోటల్లో సంచరిస్తున్న గజరాజులు

తోటపల్లిలోనే గజరాజులు

గరుగుబిల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలాన్ని గజరాజులు వీడడం లేదు. బుధవారం కూడా అవి తోటపల్లి పరిసరాల్లోనే హల్‌చల్ చేశాయి. ఆ గ్రామ ప్రధాన రహదారికి ఆనుకుని గత మూడు రోజులుగా అవి సంచరిస్తుండడంతో ఏ క్షణాన ఎవరిపై దాడి చేస్తాయోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఏనుగులు ఆ ప్రాంతంలోని పామాయిల్, అరటి పంటలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమం టున్నారు. ఏనుగుల గుంపు ప్రధాన రహదారిపైకి రాకుండా అటవీ సిబ్బంది, ట్రాకర్లు చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే వాటిని వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.

శ్యామలాంబ పండగను విజయవంతంగా నిర్వహించాలి

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి

సాలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): శ్యామలాంబ పండగను విజయవంతంగా నిర్వహించాలని పార్వతీపురం మన్యంజిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి కోరారు. బుధవారం మునిసిపల్ కార్యాలయంలో ఈ నెల 18,19,20 తేదీల్లో జరగబోయే శ్యామలాంబ అమ్మవారి పండగకు సంబంధించి అధికారులతో సమీక్షించారు. అనంతరం అమ్మవారిని ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఆలయ వెనుక భాగంప్రాంగణంలో భక్తులకు మంచినీరు, మజ్జిగను సరఫరా చేయాలని దేవదాయ శాఖాధికారులకు ఆదేశించారు. ఆలయం చుట్టూ జరుగుతున్న ఫ్లోరింగ్ వర్కు పనులను పరిశీ లించారు. అనంతరం అల్లువీధి వద్ద ఉన్న అమ్మవారి సిరిమానును రథాన్ని పరిశీలించారు. సిరిమాను తిరిగే రూట్ మ్యాపును పరిశీలించారు. పండగ సందర్భంగా వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. భక్త లకు ఎటువంటి ఇబ్బందులు కలగ కుండా అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేసి పండగను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ డీటీవీ.కృష్ణారావు, తహసీల్దార్ రమణ, డీఈ ప్రసాదరావు, స్పెషలాఫీసర్ శివకుమార్, ఎంపీడీవో పార్వతి పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మహిళలు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

భక్తిశ్రద్ధలతో శ్యామలాంబ ఆలయంలో పూజలు..

సాలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్యామలాంబ ఆలయంలో బుధవారం మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ నెల 18,19,20 తేదీల్లో నిర్వహించే పండగ విజయవంతంగా జరగాలని పూజలు నిర్వహించినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్కేన అప్పారావు తెలిపారు.

157 గ్రామాల్లో ఏసీఎం పిచికారీ

- ఇన్‌చార్జి కలెక్టర్ సేతు మాధవన్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టరు సేతుమాధవన్

విజయనగరం కలెక్టరేట్ మే 7 (ఆంధ్రజ్యోతి): మలేరియా నిర్మూలనకు ఇంటిలోపలి గోడల మీద ఏసీఎం 5 శాతం (ఆల్ఫా సైఫర్ మెత్రిన్) పిచికారీ చేయలని ఇన్‌చార్జి కలెక్టరు సేతు మాధవన్ తెలిపారు. మలేరియా ఎక్కువగా ఉన్న 18 మండలాలకు చెందిన ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, వైద్యాధికారులు, మలేరియా సబ్ యూనిట్ అధికారులతో ఆయన బుధవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా వ్యాప్తిని నిరోధించడానికి 22 పీహెచ్‌సీల పరిధిలో 157 గ్రామాల్లో రెండు విడతలుగా ఏసీఎం పిచికారీ చేయాలన్నారు. గత నాలుగేళ్ల నివేదికల ఆధారంగా ప్రతి వెయ్యి మంది జనాభాకు రెండు లేదా అంతకన్నా ఎక్కువ కేసులు నమోదైన గ్రామాలను మలేరియా ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. మే 1 నుంచి జూన్ 15 వరకు మొదటి విడత, జూలై 1 నుంచి ఆగస్టు 15 వరకు రెండో విడత అన్ని గదుల్లో గోడల మీద ఈ మందు పిచికారీ చేయాల న్నారు. జిల్లా వైద్యాధికారి జీవనరా ణి, జిల్లా మలేరియా మణి పాల్గొన్నారు.

కార్మికులు ఈ-శ్రమ్ కార్డులు తీసుకోవాలి

- సీనియర్ సివిల్ న్యాయాధికారి

విజయనగరం క్రైం, మే 7 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులు ప్రతి ఒక్కరూ కార్మికశాఖలో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఈ-శ్రమ్ కార్డులు పొందాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కృష్ణప్రసాద్ సూచించారు. మే డే వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి బబిత ఆధ్వర్యంలో బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్మిక శాఖాధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.దుర్గయ్య మాట్లాడుతూ కార్మికశాఖలో జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబరు 15100కు ఫోన్ చేసి న్యాయ సలహాలు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

- రాజాం రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): పనిచేసే చోట యాజమాన్యాలు కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జూనియర్ న్యాయాధికారి నైమిష స్పష్టం చేశారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ జ్యూట్ కర్మాగారంలో బుధవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. కార్మికులకు పనిచేసే ప్రదేశంలో స్వచ్ఛమైన గాలి, నీరు, పరిశుభ్రమైన వాతావరణం, సరైన ఉష్ణోగ్రత లు కల్పించాలని యాజమాన్య ప్రతినిధులకు సూచించారు. కార్మిక చట్టాలు, భద్రతా చర్యలను వివరించారు. కార్మికులు తమ హక్కులకు భంగం కలిగితే న్యాయస్థానాలను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారి కొండలరావు, రాజాం బార్ అసోసియేషన్ ప్రతినిధులు, జ్యూట్ కర్మాగార ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ న్యాయాధికారి నైమిష

గ్రామసభలు తీర్మానించిన పనులకే అనుమతులు

- హైకోర్టుకు నివేదించిన అడిషనల్ అడ్వొకేట్ జనరల్
- పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ఆదేశం
- విచారణ వేసవి సెలవుల తరువాతకి వాయిదా

అమరావతి, మే 7 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మండలంలో గ్రామసభలు తీర్మానాలకు అనుగుణంగానే మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకం కింద పలు పనులకు ఆమోదం తెలిపామని అడిషనల్ అడ్వకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్ బుధవారం హైకోర్టుకు నివేదించారు. పిటిషనర్ కోర్టును తప్పుదోవపట్టిస్తున్నారన్నారు. పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచుతామన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటిరవితో కూడిన ధర్మాసనం ఈ వ్యవహారం పై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పంచాయితీరాజ్‌శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. నిధుల విడుదలను నిలుపుదల చేయాలని పిటిషనర్ చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. విజయనగరం జిల్లా, విజయనగరం మండలం పరిధిలో ఉపాధిహామీ పనులు విషయంలో గ్రామసభలు చేసిన తీర్మానాన్ని పక్కనపెట్టి ఎమ్మెల్యే అదితి మహాలక్ష్మీ గజపతిరాజు చేసిన సిఫార్సులకు కలెక్టర్ పరిపాలన అనుమతులు ఇచ్చారంటూ విజయనగరంజిల్లాకు చెందిన లోకల్ గవర్నమెంట్స్ ఛాంబర్ అధ్యక్షుడు ఎం.అప్పలనాయుడు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ తరపు న్యాయవాది వడ్లమూడి కిరణ్ కుమార్ వాదనలు వినిపిస్తూ... మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకం కింద చేపట్టాల్సిన పనుల పై గ్రామసభలు తీర్మానం చేశాయన్నారు. వాటిని పక్కన పెట్టి విజయనగరం ఎమ్మెల్యే సిఫార్సు చేసిన పనులకు జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ పరిపాలన అనుమతులు ఇచ్చారన్నారు. ఇలా చేయడం ఉపాధిచట్టం నిబంధనలకు విరుద్ధమన్నారు. నిధుల విడుదలను నిలువరించాలని కోరారు.

న్యూస్ బాక్స్

ఆపరేషన్ సిందూర్ హర్షించదగ్గ పరిణామం

చీపురుపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై చేపట్టిన దాడులు దేశంలోని ప్రతి పౌరుడు గర్వించదగినవిగా ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు అన్నారు. సామాన్య పౌరులకు ఎటువంటి హాని తలపెట్టకుండా ఉగ్ర స్థావరాలను నాశనం చేయడం మంచి పరిణామమని అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాక్ ఉల్లంఘించినప్పటికీ.. సంయమనం పాటించిన మన ప్రధాని, రక్షణ, హోం మంత్రులు, త్రివిధ దళాల అధిపతులు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు.

లక్ష్మీగణపతి హోమం

శృంగవరపుకోట రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): బొడ్డవర గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు దొంతుకూర్తి సాయికుమార్ శర్మ ఆధ్వర్యంలో గ్రామపెద్దలు లక్ష్మీగణపతి హోమం, లక్ష గరిక పూజ చేశారు. అనంతరం కందుకూరి ఈశ్వరరావు, నరసింగరావు, రమేష్‌లు అన్న సమారాధన చేశారు.

మాజీ సర్పంచ్ మృతి

వేపాడ, మే 7 (ఆంధ్రజ్యోతి): చామలాపల్లి మాజీ సర్పంచ్ కుంచ భారతమ్మ(56) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె గత తెలుగుదేశం ప్రభుత్వంలో సర్పంచ్‌గా పంచాయతీకి విశేష సేవలు అందించారు. ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు స్వీకరించారు. ఆమె మృతికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సంతాపం తెలియజేశారు.

కార్మిక హక్కులకు విఘాతం

కొత్తవలస, మే 7 (ఆంధ్రజ్యోతి): కొత్త కార్మిక చట్టాల వల్ల కార్మికులు సంఘం పెట్టుకునే హక్కును కోల్పోతారని మెడికల్ రిప్రజెంట్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, జిల్లా కమిటీ సభ్యుడు జేవీ ప్రసాదరావు అన్నారు. బుధవారం స్థానిక ఏపీఓ హోంలో వ్యవసాయ కార్మిక సంఘాల ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సేవలను వినియోగించుకోండి

బొండపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు కోసం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు 7 రకాలైన సేవలు పొందేందుకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు తెలిపారు. సచివాలయాల్లో కొత్తగా రేషన్‌కార్డులు కావాల్సిన వారితో పాటు కార్డులో పేర్లు చేర్చడం, తొలగించడం వంటి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

యోగా పోటీల విజేత గౌరినాయుడు

రేగిడి, మే 7, (ఆంధ్రజ్యోతి): లింగాలవలసకు చెందిన యువకుడు రెడ్డి గౌరినాయుడు ఈనెల ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. 30 నుంచి 40 ఏళ్ల లోపు పురుషుల విభాగంలో ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 6,7,8 తేదీల్లో జరిగిన కలకత్తాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు గౌరినాయుడు కుటుంబ సభ్యులు తెలిపారు

కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలి

విజయనగరం రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కారుణ్య నియామకాలను తక్షణమే చేపట్టాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జోగారావు, చిప్పాడ సూరిబాబులు డిమాండ్ చేశారు. బుధవారం కణపాకలోని యూత్ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీల పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేసి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో 1 ప్లస్ 5 విధానంతో ఉపాధ్యాయులను నియమించి పీఎస్‌హెచ్ఎంలను మాత్రమే నియమించాలన్నారు. ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు ఈశ్వరరావు, బంగారయ్య స్వామి, వాసుదేవరావు పాల్గొన్నారు.

నవరత్నాలతో మేలు

సంతకవిటి, మే 7 (ఆంధ్రజ్యోతి): పొలంలో నవధాన్యాలు సాగుచేస్తే నేలతల్లి బాగుంటుందని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇంచార్జ్ పాత్రుని వెంకటరమణ అన్నారు. బుధవారం గుళ్లసీతారాంపురం గ్రామంలో అన్నంనాయుడుకు సంబంధించిన పొలంలో ప్రయోగాత్మకంగా నవధాన్యాల విత్తనాలు వేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ జీలుగు, పెసర, ఉలవలు, కందులు, తదితర విత్తనాలను వేసినట్టు తెలిపారు.

కన్యకా పరమేశ్వరికి వైభవంగా పూజలు



అమ్మవారి చారిత్రక ఘట్టాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, తదితరులు

విజయనగరం రింగురోడ్డు, మే 7 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను బుధవారం ఆలయంలో ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఉదయం 4 నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని బంగారు చీరెలు, వజ్రకిరీటంతో అలంకరించారు. సాయంత్రం రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజులు అమ్మవారి చరిత్రకు సంబంధించిన 25 ఘట్టాలను ఆవిష్కరించారు. 102 రకాల పిండివంటలు అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు నారాయణం శ్రీనివాస్, కాపుగంటి ప్రకాష్, కుమ్మరిగుంట శ్రీనివాసరావు, మురుగన్, వెత్సా సత్యనారాయణ మూర్తి, భక్తులు పాల్గొన్నారు.

కొత్తవలసలో...

కొత్తవలస, మే 7 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలోనున్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు తీగెల అన్నాజీరావు, మిన్నకోట సతీష్, కంకాల పండు, మామిడి గుప్త పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. జరజాపుపేట ఒకటో వార్డు ఎస్సీ కాలనీలో రూ.2.5లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆమె బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె కాలనీ వాసులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. అన్ని సమస్యలు దశల వారీగా పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో నగర పంచాయితీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ ఛైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, కౌన్సిలర్ కింతాడ కళావతి, జనసేన నాయకులు కరుమజ్జి గోవిందరావు, ఎం.ఎం.నాయుడు, రవ్వా నాని, గదల అచ్చింనాయుడు, ఎడ్ల గోవిందరావు, అప్పికొండ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల కమిటీలను పునర్వ్యవస్థీకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు, మే 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీధి విక్రయదారులను గుర్తించి.. కమిటీలను పునఃవ్యవస్థీకరించే కార్యక్రమాన్ని ఈ నెల 14లోపు పూర్తి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య కార్యదర్శులకు ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కార్యదర్శులతో మాట్లాడారు. వీధి విక్రయదారులను గుర్తించే సర్వే ప్రక్రియ శతశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలో రెడ్, గ్రీన్, అంబర్ జోన్‌లను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. వీధి విక్ర యదారులకు గుర్తింపు కార్డులను అందజేయాల్సి ఉందని చెప్పారు. రెడ్‌జోన్‌లో వీధి విక్రయాలు పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. గ్రీన్ జోన్‌లో వీధి విక్రయాలు కొనసాగించవచ్చునని.. అంబర్ జోన్‌లో నియమిత కాల పరిమితిలో వ్యాపారాలు చేసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు హరిబాబు, సింహాచలం, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్స్ పరిశీలన

మెరకముడిదాం, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్స్ మండల స్టాక్ పాయింట్‌ను జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు సీఎంవో వి.ఆదినారాయణ, అసిస్టెంట్ సీఎంవో ఎ.రామారావు సందర్శించారు. ఇంతవరకు మండలానికి వచ్చిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాల వివరాలను మండల విద్యాశాఖ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు ఎం.చంద్రశేఖర్, టి.ధర్మ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఇది పేదల ప్రభుత్వం: ఎమ్మెల్యే కోళ్ల



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి దంపతులు

లక్కవరపుకోట, మే 7(ఆంధ్రజ్యోతి): తమది పేదల ప్రభుత్వమని.. అభివృద్ధికి, సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. బుధవారం ఆమె వివిధ సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాడి రైతులకు 50శాతం రాయితీపై వచ్చిన పశువుల దాణాను పంపిణీ చేశారు రైతులకు అభివృద్ధికి చంద్రబాబు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం గులివిందాడ, గనిశెట్టిపాలెం, తుమ్మికాపల్లి, కళ్లెంపూడి, మామిడిపల్లి గ్రామాలలోని బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేబీపీ రాంప్రసాద్, లాలం అర్జునరావు, కొట్టాన విజయ్, పశువైద్యాధికారి కె.గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి

విజయనగరం బాబామెట్ట, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురజాడ స్మారక గ్రంథాలయంలో బుధవారం రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి మాట్లాడుతూ, సాహిత్య రంగంలో రవీంద్రనాథ్ ఠాగూర్ భారతదేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ పి.పద్మావతి, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు

బొండపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): కొలతల ప్రకారం పనిచేస్తే వేతనాలు గిట్టుబాటు అవుతాయని ఉపాధి హామీ ఏపీవో కె.అరుణకుమారి సూచించారు. రోళ్లవాక గ్రామంలో బుధవారం ఉపాధి పనులు చేపడుతున్న చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల మస్తర్లను పరిశీలించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 6 గంటలలోగా పనిలోకి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సహాయకుడితో పాటు కూలీలు పాల్గొన్నారు.

విద్యార్థినికి రాష్ట్రస్థాయి పురస్కారం

విజయనగరం కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షల్లో 958 మార్కులు సాధించిన కీర్తన రాష్ట్ర స్థాయి ప్రతిభా పురస్కారాన్ని బుధవారం అందుకుంది. గజపతినగరం సాంఘిక సంక్షేమ వసతి గృహంలో చదువుతున్న కీర్తన మంచి మార్కులు సాధించడంతో బుధవారం విజయవాడలో రాష్ట్ర మంత్రి బాల వీరాంజనేయులు పురస్కారాన్ని అందించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం

మెరకముడిదాం, మే 7 (ఆంధ్రజ్యోతి): బుదరాయవలస గ్రామంలో బుధవారం వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాజాంలో..

రాజాం, మే 7 (ఆంధ్రజ్యోతి): శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన మహోత్సవాన్ని రాజాంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మాధవబజార్ కూడలివద్ద విశ్వబ్రాహ్మణ సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు ముగడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రసాదాలతో పాటు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు.

అధికారులు పారదర్శకంగా సేవలందించాలి

దత్తిరాజేరు, మే 7(ఆంధ్రజ్యోతి): అధికారులు పారదర్శకంగా సేవలందించాలని ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు కోరారు. బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో వ్యవసాయాధికారిణి అనూరాధ మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరు చేయాలని హౌసింగ్ ఏఈ రాజేష్‌ను ఎంపీపీ ఆదేశించారు.

క్రైం న్యూస్ | చామలాపల్లిలో యువకుడి హత్య



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ నారాయణమూర్తి



ప్రసాద్ (ఫైల్)

శృంగవరపుకోట రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): చామలాపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నడుపూరి మురళికి.. మృతుడు తొత్తడి ప్రసాద్(38)కు కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. మరోవైపు మురళీకి అతని భార్యతో గొడవల కారణంగా రెండేళ్లుగా విడివిడిగా ఉంటున్నారు. పెద్దలతో వెళ్లి భార్యను ఇంటికి రమ్మని కోరినా రాకపోవడం..పిల్లలను తన వద్దకు పంపించకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. తన భార్య దూరంగా ఉండడానికి ప్రసాద్ కారణమని భావించేవాడు. దీంతో అతనిపై పగ పెంచుకున్నాడు. ఎప్పటికైనా ప్రసాద్‌ను చంపుతానని పదేపదే చెప్పేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం తన ఇంటి పక్కన జరగనున్న పెళ్లికి ప్రసాద్ టెంటు, ఇతర సామాన్లు తెచ్చి సర్దడాన్ని మురళి గమనించాడు. అప్పటికే కత్తితో కాచుకొని ఉన్న మురళి.. ప్రసాద్‌పై దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో భయపడిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ నారాయణమూర్తి తన సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. సంఘటనకు సంబంధించిన సమాచారాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని పోలీసులకు స్థానికులు తెలిపారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ శ్రీనువాసరావు, క్లూస్ టీం పరిశీలించింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలిపేందుకు పోలీసులు నిరాకరించారు. ఇదిలా ఉండగా నిందితుడు మురళి బుధవారం రాత్రి ఎస్.కోట పోలీసులకు లొంగిపోయినట్టు తెలిసింది.

గంజాయి స్వాధీనం: ఇద్దరి అరెస్టు

రాజాం రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): రాజాం-శ్యాంపురం రోడ్డులో బుధవారం సాయంత్రం అగ్రహారం జంక్షన్ వద్ద ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.ఐ.రవికిరణ్ తెలిపారు. ఆయన అందించిన సమాచారం ప్రకారం కొరారిపురం గ్రామానికి చెందిన పంచిరెడ్డి వెంకటరమణ, డోలపేటకు చెందిన పూతిక హరిశంకర్ స్కూటీపై వెళ్తుండగా వారి నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇన్‌ఛార్జి సి.ఐ. హెచ్.ఉపేంద్రరావు కేసు నమోదు చేశారని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా... 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్.ఐ. రవికిరణ్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

తెర్లాం, మే 7 (ఆంధ్రజ్యోతి): తెర్లాం అడ్డు రోడ్డు కూడలిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ సాగర్‌బాబు కథనం మేరకు.. గుర్తుతెలియని వాహనం మంగళవారం రాత్రి ఓ గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొంది. తలకు బలమైన గాయంకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని బాడంగి పీహెచ్‌సీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు వివరాలు పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

ఎంపీ నిధులతో ఘోషాసుపత్రిలో అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే అదితి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రింగురోడ్డు, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎంపీ నిధులతో ఘోషాసుపత్రిలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తెలిపారు. బుధవారం ఘోషాసుపత్రిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడు విజయేంద్రప్రసాద్ రూ.50 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. అలాగే ఆసుపత్రిలో లిఫ్ట్ ఏర్పాటుకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు రూ.26.05 లక్షలు మంజూరు చేశారన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం మార్పు

విజయనగరం రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని మార్చనున్నట్టు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పారు. విగ్రహం పాడవ్వడంతో పాటు, రైలింగు కూడా దెబ్బతిందని తెలిపారు. ఈ నేపథ్యంలో నూతన విగ్రహం, రైలింగ్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఈ నూతన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 28లోగా పూర్తి చేయనున్నట్టు తెలిపారు.

దత్తిరాజేరులో ఈదురుగాలుల బీభత్సం



ఎస్.చింతవలసలో నేల కూలిన చెట్టు

దత్తిరాజేరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. ఎస్.చింతవలస, పాచవలస, దత్తి, దత్తిరాజేరు తదితర గ్రామాల్లో గాలులు వీయడంతో చెట్లు, సుమారు 15 విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. దీంతో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సంబంధిత సిబ్బంది పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. చెట్లు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

విద్యుత్ అంతరాయంతో ఇక్కట్లు

మెరకముడిదాం, మే 7 (ఆంధ్రజ్యోతి): గర్భాం 132/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం సుమారు 5 గంటల పాటు సరఫరా నిలిచిపోవడంతో జనాలు అల్లాడిపోయారు. మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో చిరుజల్లులతో పాటు కొద్దిపాటి గాలి వీయడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అప్పటి నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఉక్కపోత భరించలేక చిన్నారులు, వృద్ధులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ సబ్ స్టేషన్ పరిధిలో సుమారు 13 పంచాయతీలు ఉన్నాయి. గర్భాం మేజరు పంచాయతీకి 24 గంటల విద్యుత్ సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ ఎప్పటికప్పుడు విద్యుత్ కోతలు విధించడంపై వినియోగదారుల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా విద్యుత్ బిల్లులు తగ్గకపోవడంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



భోగాపురం జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

భోగాపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు బుధవారం అపూర్వ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 1982-83లో పదో తరగతి చదువుకొన్న విద్యార్థులు ఆనందంగా ఒకచోట గడిపారు. సుమారు 42 సంవత్సరాల తరువాత అందరూ ఒకేచోట కలుసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు

ఓటరు జాబితాల్లోని సమస్యలను తెలియజేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సవరవరమ్మ

రాజాం, మే 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఓటరు జాబితాకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా తెలియజేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి. సవరవరమ్మ సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఫిర్యాదులు చేయడం వల్ల సమస్యలను పరిష్కరించలేకపోతున్నామని, ఓటరు జాబితాలో లేదా పోలింగ్ కేంద్రాల విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో రేగిడి, వంగర, సంతకవిటి తహసీల్దారులు ఈశ్వరరావు, బి.ధర్మరాజు, బి.సత్యం, నాయకులు నారాయణరావు, జొన్నాడ రంజిత్, గుడివాడ నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

45వేల మందికి ఈకేవైసీ కాలే..

(5వ పేజీ తరువాయి)

మార్పు రావడం లేదు. ఈ అక్రమాలకు చెక్ పెట్టేందుకే ప్రభుత్వం రేషన్ కార్డుల ఈకేవైసీకి శ్రీకారం చుట్టింది.

ఎక్కడైనా చేసుకోవచ్చు..

రేషన్‌కార్డు ఈకేవైసీని రాష్ట్రంలో ఎక్కడైనా చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. సమీప సచివాలయం, ఎండీయూ (రేషన్ బండి) వద్దకు వెళ్లి ఈకేవైసీ చేసుకోవచ్చు. జిల్లా నుంచి వలస వెళ్లిన వారు దీనిని గమనించాలి. రేషన్‌కార్డుల ఈకేవైసీలో మన్యం జిల్లా రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో ఉంది. ఇప్పటి వరకు 7.59 లక్షల మందికి ఈకేవైసీ పూర్తి చేశాం. నాలుగు మండలాలు వెనుకబడి ఉన్నాయి. ఈకేవైసీ గడువు వచ్చే నెల 30 వరకు పొడిగించారు. క్షేత్రస్థాయి సిబ్బంది దీనిపై చొరవ చూపాలి. ఈ ప్రక్రియను శతశాతం పూర్తి చేయాలి.

- ఐ.రాజేశ్వరి, డీఎస్‌వో, పార్వతీపురం మన్యం

స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్లలో శిక్షణ

● జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణచైతన్య

పార్వతీపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్లలో మూడు నెలల వ్యవధిలో వివిధ కోర్సులపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత శుక్రవారంలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఒక్కో నియోజక వర్గంలో 120 మంది చొప్పున నాలుగు నియోజకవర్గాల్లో 480 మందికి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

● పార్వతీపురం నియోజకవర్గంలోని ఎంఆర్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ వాయిస్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులపై శిక్షణ ఇవ్వనున్నారు. వివరాల కోసం 91772 97528 నెంబర్‌కు సంప్రదించాలి.● కురుపాం నియోజకవర్గంలోని గుమ్మలక్ష్మీపురం జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో డొమెస్టిక్ ఐటీహెల్ప్ డెస్క్ అటెండెంట్, రిసెప్షనిస్టు కోర్సులకు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నారు. వివరాలకు 6303493720 నెంబర్‌కు సంప్రదించాలి.● పాలకొండ నియోజకవర్గంలోని సీతంపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఫ్లాంప్లింగ్ టైలర్, ఫోర్‌వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులకు సంబంధించి శిక్షణ ఇస్తారు. వివరాలకు 8897677564 నెంబర్‌కు సంప్రదించాలి.●సాలూరు నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్, డొమెస్టిక్ డేటాఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నారు. వివరాలకు 7382559022 నెంబర్‌కు సంప్రదించాలి.

మునిసిపల్ కార్మికుల సమ్మె నోటీసు

పాలకొండ, మే 7 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కమిషనర్ రత్నం రాజుకు దేశవ్యాప్త సార్వత్రికసమ్మె ఈనెల 20న నిర్వహించనున్న నేపథ్యంలో ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ పాలకొండ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సమ్మెనోటీసు అందజేశారు.కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి సీహెచ్‌సంజీవి, కోశాధికారి పి.వేణు,కార్యవర్గ సభ్యులు విమల,శ్రీదేవి, సీఐటీయూమండల కార్యదర్శి కాద రాము పాల్గొన్నారు.

అంగన్‌వాడీ యూనియన్ నాయకులు...

కురుపాం,మే7(ఆంధ్రజ్యోతి): కురుపాం ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బందికి అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు జె.సరోజ ఆధ్వర్యంలో ఈనెల 20న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల చేపట్టబోయే సమ్మెలో పాల్గొంటున్నారని బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శోభరాణి, సూర్యకుమారి,రాణి,సరస్వతి,రాధకుమారి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవాలు



ఉత్సవ విగ్రహాలతో తిరువీధి నిర్వహిస్తున్న స్వర్ణకార సంఘ సభ్యులు

పార్వతీపురంటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి జ్ఞజ్యోతి(31వ ఆరాధన మహోత్సవాలు) కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం పట్టణ ప్రధాన రహదారిలోని పార్వతీదేవిఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందాంబ ఉత్సవ విగ్రహాలకు పట్టణ స్వర్ణకారం సంఘ అధ్యక్షుడు బి.రంగారావు ఆచారి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలమధ్య ప్రథమ పూజను జరిపించారు. అనంతరం పార్వతీదేవి ఆలయం నుంచి ప్రధాన రహదారి గుండా కంగటి వీధిలోని ఉత్సవ మండపంవరకు తిరువీధి నిర్వహించారు.కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పి.మార్కండేయులు, కార్యదర్శి కె.శ్రీనివాసరావు, పి.రవి, గౌరవాధ్యక్షులు ఎం.ప్రకాష్ రావు ఆచారి, స్వర్ణకార సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విధులపై స్పష్టత ఇవ్వాలి

మక్కువ, మే 7(ఆంధ్రజ్యోతి): తమ విధులపై స్పష్టత ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం మక్కువలో ఎంపీడీవో డీడీ స్వరూపారాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జేసీ ఇటీవల పంచాయతీ కార్యదర్శులు సచివాలయాల సిబ్బందితో సమానమని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. సచివాలయాల్లో తామేమీ చేయాలో స్పష్టమైన మార్గదర్శకాలిస్తే సంబంధిత పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మార్గదర్శకాలు వచ్చే వరకు తమ క్లస్టర్ పనులు చేసుకుంటామని చెప్పారు. తమ విధులు, కార్యప్రణాళికలు రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఐ.రమేష్, కంది సురేష్, శంకర్, వేణుగోపాల్, సీత, పోలిరాజు పాల్గొన్నారు.

●పార్వతీపురం రూరల్,మే7(ఆంధ్రజ్యోతి):గ్రామ సచివాలయాల పర్యవేక్షణపై గ్రామ కార్యదర్శులకు ఉన్న అధికారాలపై స్పష్టత ఇవ్వాలని జిల్లా గ్రామ కార్యదర్శుల సంఘం డిమాండ్‌చేసింది. జిల్లా పంచాయతీ, జీఎస్ డబ్ల్యుఎస్ ప్రత్యేకాధికారి కార్యాలయంలో అధికారులకు జిల్లా గ్రామ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో అందించారు.

మురుగునీటి సమస్య పరిష్కరించండి

సాలూరు,మే7(ఆంధ్రజ్యోతి):మురుగునీటి సమస్య పరిష్కరించాలని దాసరి వీధి మహిళలు కోరారు.ఈ మేరకు బుధవారం మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి మురుగునీటి సమస్యతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని కమిషనర్, అధికారులకు సమస్యను వివరించారు. మురుగునీటి సమస్య వల్ల దోమలు, ఈగలు విజృంభించి నిత్యం అనారోగ్యంబారిన పడుతున్నామని వాపోయారు. కాగా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు.

మాలికేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

భామిని, మే 7 (ఆంధ్రజ్యోతి):భామినిలోని మాలికేశ్వరి అమ్మవారికి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటుచేశారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయండి: ఎంపీ

రాయగడ, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కొరాపుట్ ఎంపీ సప్తగిరిశంకర్ ఉలకా కోరారు. స్థానిక జిల్లాపరిషత్ సద్భావన హాలులో జిల్లాస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈసందర్భంగా పలు విభాగాల అధికారులతో అభివృద్ధి పనులపై చర్చించారు. రాయగడ రైల్వే డివిజన్‌గా ఏర్పడిన తర్వాత జరగాల్సిన పలు అభివృద్ధి పనులపై ప్రస్తావించారు. తెరువలి-గుణుపూర్ రైలు మార్గం నిర్మాణం, కె.సింగుపూర్-కొరాపుట్ రైల్వే లైను డబ్లింగ్ పనులు, రైల్వే ఇళ్ల నిర్మాణం పై అధికారులతో చర్చించారు. గ్రామీణాభివృద్ధి శాఖ రాయగడ, గుణుపురంలో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల పురోగతి, ప్రధానమంత్రి గ్రామసడక్‌యోజన, ఉద్యానవన, మెగా నీటిసరఫరా,గ్రామ గృహయోజనపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పారుల్ పట్వారి, జిల్లా పరిషత్ అభివృద్ధి శాఖాధికారి అక్షయ్‌కుమార్ ఖెముండు, ఎమ్మెల్యేలు సత్యజిత్ గొమాంగ్, అప్పలస్వామి కద్రక, ఎస్పీ స్వాతి ఎస్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ రోడ్డు సౌకర్యం

● కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి



బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపనచేస్తున్న జగదీశ్వరి

జియ్యమ్మవలస, మే 7(ఆంధ్రజ్యోతి):ప్రతి గ్రామానికీ రోడ్డు సౌకర్యం కల్పించి ప్రజలకు అత్యవసర సేవలందించడం, సంక్షేమ కల్పన ప్రభుత్వ ధ్యేయమని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ తోయక జగదీశ్వరి తెలిపారు. బుధవారం మండలంలోని జియ్యమ్మవలస -పార్వతీపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి గెడ్డతిరువాడ పంచాయతీ చిలకలవానివలస మీదుగా పసుపువానివలస వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల పంచాయతీరాజ్ జేఈ పార్థసాయి, ఎంపీపీ బొంగు సురేష్, అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు పాల్గొన్నారు.

● వనజ గ్రామానికి చెందిన వీఆర్వో నిమ్మక విజయానంద్ కుటుంబాన్ని బుధవారం తోయక జగదీశ్వరి పరామర్శించారు. ఈ సందర్భంగా వీఆర్వో సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజుతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరును అడిగితెలుసుకున్నారు. ఆమె వెంట ఆరిక నీలకంఠం, కొండగొర్రి ధర్మారావు, ఎంపీపీ బొంగు సురేష్, టీడీపీ నాయకులు దత్తి లక్ష్మణరావు, మధుసూదనరావు, రాంబాబు ఉన్నారు.

గిరిజన విద్యకు ప్రాధాన్యం

● పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



పనులకు భూమిపూజచేస్తున్న జయకృష్ణ

సీతంపేట రూరల్,మే 7(ఆంధ్రజ్యోతి):గిరిజన విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు.బుధవారం మండలంలోని దారిమల్లి, జిల్లేడుపాడు, శంభాం, వాబ గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్, పీఎంజేజీఎం నిధులతో నిర్మించిన పాఠశాలల ప్రహరీలు, మంచినీటి పైప్‌లైన్ స్కీమ్‌లకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ప్రతి ఇంటికి మంచినీరందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. తీలుత మల్లి ఆశ్రమ పాఠశాల ప్రహరీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధిత పాఠశాల సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బి.సంధ్యారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుసూదనరావు, ఉమ్మడి జిల్లాల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు గర్భాన సత్తిబాబు, నాయకులు కె.రాజేష్,పవన్, ప్రసాద్, మాలయ్య, శేఖర్,సాయి,రవణమ్మ పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్/బెలగాం: అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, అధికారులు



జియ్యమ్మవలస: టీకే జమ్ములో..



గరుగుబిల్లి: నాగూరులో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు



సీతంపేట రూరల్: ఐటీడీఏ కార్యాలయంలో..

అల్లూరి స్ఫూర్తితో పోరాడాలి

●వర్ధంతి పురస్కరించుకుని చిత్రపటాలు, విగ్రహాలకు నివాళులర్పించిన నాయకులు

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ప్రతి గిరిజనుడు హక్కులకోసం సమిష్టి పోరాటం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి పురస్కరించుకుని విగ్రహాలు, చిత్రపటాలకు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, పలుచోట్ల ప్రజాప్రతినిధులు, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



కొమరాడలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

● టీఏసీ ఏర్పాటుచేయాలి ● 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

●గుమ్మలక్ష్మీపురం ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సభ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ జేఏసీ నాయకులు

గుమ్మలక్ష్మీపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల అభ్యర్థులకోసం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కోరారు. బుధవారం గుమ్మలక్ష్మీపురం ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసీ ఆత్మగౌరవ సభ, ర్యాలీ నిర్వహించారు.తొలుత గుణుపూర్ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైటీసీలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన నాయకులు మాట్లాడుతూ జీవో -3 స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చి ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. ట్రైబల్ అడ్వయిజరీ కమిటీను ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. నకిలీ గిరిజన సర్టిఫికెట్లతో చాలా మంది చెలామణి అవుతున్నారని, వెంటనే వాటిని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బ లోవరాజు, జేఏసీ వైస్ చైర్మన్ దుక్క సీతారాం, ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బొత్తాడ గౌరీశంకరరావు, ఎంపీపీ దీనమయ్య, ఆల్ ఇండియా గిరిజన సంఘం రా ష్ట్ర అధ్యక్షుడు నిమ్మక సింహాచలం, రాష్ట్ర నాయకులు బిడ్డిక రామారావు, ఏజేఏసీ నాయకులు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

పాలకొండ, మే 7 (ఆంధ్రజ్యోతి): పాలకొండ డిపోలో డయల్‌యువర్ డీఎం కార్యక్రమం శుక్రవారంఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.సమస్యలుంటే ప్రయాణికులు9959225057నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.

●సాలూరు రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు వారి అభిప్రాయాలు తెలుసుకునేందుకు శుక్రవారం డయల్‌యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సాలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ బీఎస్ఎస్ మూర్తి చెప్పారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య 9959225622 నెంబర్‌కు ఫోన్‌చేయాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ

జియ్యమ్మవలస, మే 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇటీవలమృతి చెందిన వీఆర్వో నిమ్మక విజయానంద్ కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పరామర్శించారు. వనజలో మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజును, విజయానంద్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

ఈదురుగాలుల బీభత్సం

●భామిని మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం



పెద్దదిమిలిలో తెగిపడిన విద్యుత్ తీగలు

భామిని, మే 7 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పెద్దదిమిలి, సతివాడ, కీసర, కోసలిలో బుధవారం సాయంత్రం ఈదురుగాలుల బీభత్సం సృష్టించాయి. దీంతో మండలమంతా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు సంభవించాయి. ఈదురుగాలులకు చెట్టుకొమ్మలు, విద్యుత్ తీగలపై పడడం నేలమట్టమయ్యాయి. పిడుగులు, ఉరుములు వల్ల కొత్తూరు నుంచి భామిని వెళ్లే 33 కేవీ విద్యుత్ లైన్లకు ఉన్న పింగాణీ ప్లేట్లు కూలడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు. పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా నిలిపివేశారు.ఈదురుగాలుల వల్ల ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

స్టాక్ పాయింట్లకు పుస్తకాల తరలింపు

గరుగుబిల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా పరిధిలోని 15 మండలాలకు మొదటి విడతగా అవసరమైన నోట్, పాఠ్య పుస్తకాలను మండల కేంద్రాల్లోని స్టాక్ పాయింట్లకు తరలించినట్టు జిల్లా ఉపవిద్యాశాఖాధికారి రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం గరుగుబిల్లిలో మండలంలోని పాఠశాలలకు కేటాయించిన పుస్తక సామగ్రిని పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసే పుస్తకాలపై సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. పాఠశాలల పునః ప్రారంభమయ్యేంతవరకు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. మండలానికి సంబంధించి 13,452 పుస్తకాలు అందాయని ఉప విద్యాశాఖాధికారికి ఎంఈవోలు దత్తి అప్పలనాయుడు, కె.కొండలరావు వివరించారు. పంపిణీ జరిగే వరకూ రోజువారీ పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ బోను రామకృష్ణ, సిబ్బంది వి.శారద, రమణమ్మ, పాల్గొన్నారు.

పెదగుడబలో ప్రీస్కూల్ సంసిద్ధత కార్యక్రమం

గరుగుబిల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుడబ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ సంసిద్ధత కార్యక్రమాన్ని కార్యకర్త చింతాడ గౌరమ్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి గొట్టాపు సుగుణకుమారి, పెదగుడబ ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి సూచనలు, సలహాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఎస్.రమణమ్మ, ఆశావర్కర్ ఎస్.మంజుల పాల్గొన్నారు.

ఎంపీడీవో బీబీ మిశ్రో బాధ్యతల స్వీకరణ

సీతంపేట రూరల్,మే 7(ఆంధ్రజ్యోతి):సీతంపేట ఎంపీడీవోగా బీబీ మిశ్రో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతిపై పొందూరు మండలం నుంచి ఇక్కడికి వచ్చారు. గిరిజన ప్రాంతంలో సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు.

టీకాల వివరాలు నమోదు చేయాలి

●ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహన్‌రావు

పార్వతీపురం రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక టీకాల కార్యక్రమంలో పిల్లలకు వేసిన ప్రతి టీకా వివరాలు నమోదుచేయాలని ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు కోరారు. బుధవారం ఎంఆర్‌నగరంలో టీకా కార్య క్రమాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పిల్లలు, గర్భిణుల టీకాలు రికార్డులు పరిశీలించారు. పిల్లల వయస్సును బట్టి వేయాల్సిన అన్ని టీకాలు కచ్చితంగా పూర్తి చేసి యువిన్, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. టీకాల నిర్వహించే సమయంలో ఉండాల్సిన హబ్‌కట్టర్, ఏఈఎఫ్ఐ కిట్ పరిశీలించారు. వ్యాక్సిన్ వేసిన తర్వాత కొంతవరకు అక్కడే పర్యవేక్షణలో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడమిక్ ఈవో సత్తిబాబు, ఏఎన్ఎం డి.పోలమ్మ పాల్గొన్నారు.

దాడికి పాల్పడినవారిని శిక్షించాలి

పార్వతీపురంటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి):వంగర మండల జడ్పీటీసీ కరణం సుదర్శనరావుపై ఇటీవల దాడికి పాల్పడ్డవారిని శిక్షించాలని ఉమ్మడి జిల్లాల చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. బుధవారం రాత్రి జడ్పీచైర్మన్‌తో పాటు ఆ పార్టీ నాయకులు దాడికి పాల్పడినవారిని పట్టుకొని శిక్షించాలని ఎస్పీ మాధవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యదేశంలో ప్రజాప్రతినిధిపై దాడులకు పాల్పడుతుండడం దురదృష్టకరమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు శాఖపరంగా దర్యాప్తుతో పాటు సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

నలుగురికి జరిమానా

పాచిపెంట, మే 7(ఆంధ్రజ్యోతి): డ్రింక్ అండ డ్రైవ్ కేసులో నలుగురికి రూ. 10 వేలు చొప్పున రూ. 40 వేలు సాలూరు జేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ జి.హర్షవర్ధన్ జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారని ఎస్ఐ కె.వెంకటసురేష్ తెలిపారు. రెండోసారి పట్టుబడితే ఆరునెలలు జైలుశిక్ష విధించనున్నట్లు తెలియజేశారని పేర్కొన్నారు.

డ్రాయింగ్‌పై అవగాహన

పాలకొండ, మే 7 (ఆంధ్రజ్యోతి):పాలకొండ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు డ్రాయింగ్‌పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డ్రాయింగ్ మాస్టార్ గొర్లె మురళి డ్రాయింగ్‌లో మెళకువలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి గణేష్‌బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

రేపు పార్వతీపురంలో జాబ్‌మేళా

పార్వతీపురం,మే 7(ఆంధ్రజ్యోతి):పార్వతీపురం బాస్కర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని 18 ఏళ్ల నుండి 28 ఏళ్ల వయస్సు ఉన్న నిరుద్యోగ యువత జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. మేళాలో 12 కంపెనీలకు చెందిన ప్రతినిధులు అర్హతగల వారిని ఎంపికచేస్తారని పేర్కొన్నారు. వివరాలకు 9177297528, 9494777553 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ప్రతిభచూపిన విద్యార్థులకు అభినందన



సీతంపేట రూరల్: రాష్ట్ర ఉత్తమ హెచ్‌ఎం అవార్డు అందుకుంటున్న హడ్డుబంగి హెచ్‌ఎం

పార్వతీపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన, సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని విద్యాలయాల్లో విద్యార్థులు పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపడంతో బుధవారంవిజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. కళాశాలలు, పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులకు, వివిధ సబ్జెక్టు ఉపాధ్యాయులు, హెచ్‌డబ్ల్యూవోలకు సన్మానించారు.ఈ మేరకు గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖల మంత్రులు గుమ్మడి సంధ్యారాణి,మంత్రి డోలబాల వీరాంజనేయస్వామి, గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ సెక్రటరీ ఎం.ఎం నాయక్ అభినందన పత్రాలు అందజేశారు.జిల్లా నుంచి బెస్ట్ నోడల్ ప్రిన్సిపాల్ ఎం.యుగంధర్, హెచ్‌ఎంలు బి.ఉషారాణి, శ్రీదేవి, శారద, ఉపాధ్యాయులు జ్ఞానప్రకాష్, వి.విజయశ్రీ, సీహెచ్‌వీ రమణ, ఎం.ధర్మరాజు, సత్యవతి, పి.సూర్యకుమారి, కె.సురేష్, ఏ.అరుంధతి, వాసుదేవరావు,పదోతరగతిలో 564 పైబడి మార్కులు సాధించిన కె.సాయికుమార్, ఎల్.అక్షయ, ఎం.శ్వేత, ఎస్.ఆకాష్, బి. ప్రియ, ఎస్. ఉషారాణి, ఎస్.మధురిమ, వి.మహాలక్ష్మి,శశికళ, ఇంటర్‌కు సంబంధించి బి.శశికళ, బి.రాకేష్, అభిరామ్, నిమ్మకాయ ఇందు, శిరీష, ఎస్.నందినిలను అభినందించారు.

వాడీవేడిగా సాలూరు మండల సమావేశం

సాలూరు రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండల సమావేశం వాడివేడిగా జరిగింది. బుధవారం ఎంపీపీ గరుగుబిల్లి అధ్యక్షతన, వైస్ ఎంపీపీ రెడ్డిసురేష్ ఆధ్వర్యంలో పలు అంశాలపై చర్చ జరిగింది. ఈసందర్భంగా సర్పంచ్‌లు సహకరించకుంటే అభివృద్ధి ఎలా సాధ్యమని, అధికారులు ఏంచేయగలరని ఖరాసవలస ఎంపీటీసీ అప్పికొండ రమాదేవి ప్రశ్నించారు. గోశాలలు పంచాయతీ తీర్మానం లేకుండా ఎవరు, ఎలా మంజూరు చేశారో చెప్పాలని శివరాంపురంఎంపీటీసీ కల్లేపల్లి త్రినాథ్, సర్పంచ్ బంటరు తిరుపతినాయుడు నిలదీశారు. వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ జోక్యం చేసుకుంటు వార్డు మెంబర్ కాని వ్యక్తికిచ్చే విలువ సర్పంచ్,ఎంపీటీసీలకు ఇవ్వకుంటే ఎలా సహకరిస్తారని ప్రశ్నించారు.వెలుగు సమావేశాలు ప్రోటోకాల్ పాటించకుండా నిర్వహించడంపై ఏపీఎం జయమ్మను వైస్ ఎంపీపీ సురేష్, శివరాంపురం ఎంపీటీసీ త్రినాథ్ ప్రశ్నించారు. బాగువలస నూతన ఎఫ్‌ఏ అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఎంపీటీసీ త్రినాథ్ ఆరోపించారు. సమావేశంలో సాలూరు తహసీల్దార్ ఎన్వీ రమణ, ఎంపీడీవో పార్వతి, ఏపీవో రామకృష్ణ పాల్గొన్నారు.